
MRR 69 TV


అవినీతిపై అక్షర సమరం

మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక

ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 6 | సంచిక : 135 | మంగళవారం 8 సెప్టెంబర్ 2026 | పేజీలు : 4 | వెల : 3/-



# వాట్సప్ గవర్నెన్స్, డిజిటల్ సేవలు..

- పాలనలో బెస్ట్ ప్రాక్టీసెస్ పాటించాలి
- ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం
- ఉచిత ఇసుక విధానాన్ని పక్కాగా అమలు చేయాలని సీఎం ఆదేశం
- ఎమ్మార్పీ కంటే ఎక్కువకు మద్యం అమ్మితే కఠిన చర్యలని హెచ్చరిక
- ఫేక్ ప్రచారాన్ని వాస్తవాలతో సమర్థంగా తిప్పికొట్టాలని నేతలకు సూచన
- 175 నియోజకవర్గాల్లో రూ.20,400 కోట్ల విలువైన పనులకు ఆమోదం

**అమరావతి**

ప్రభుత్వ, పరిపాలన సేవలను ప్రజలకు మరింత సమర్థంగా అందించడంపై దృష్టి సారించాలని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ ఎమ్మెల్యేలు, నేతలకు పిలుపునిచ్చారు. రెండోరోజు లీడర్‌షిప్ కాన్‌క్లేవ్‌లో ప్రసంగించిన ఆయన, కొన్ని నియోజకవర్గాలు పౌర సేవల్లో మంచి ఫలితాలు సాధిస్తున్నాయని, అన్ని నియోజకవర్గాలు ఆ ఉత్తమ పద్ధతులను (బెస్ట్ ప్రాక్టీసెస్) అమలు చేయాలని దిశానిర్దేశం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక విధానాన్ని పక్కాగా అమలు చేస్తున్నామని, దీనివల్ల ఏటా రూ.1000 కోట్ల ఆదాయం వదులుకుంటున్నామని చంద్రబాబు గుర్తుచేశారు. ఎక్కడైనా ఇసుక అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలిపోతే కఠినంగా అడ్డుకోవాలని ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో మద్యం విధానాన్ని అస్తవ్యస్తం చేసి, నకిలీ బ్రాండ్లతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారని విమర్శించారు. ఇప్పుడు మద్యం విక్రయాల్లో పారదర్శకత తీసుకొచ్చామని, ఎమ్మార్పీ కంటే ఒక్క రూపాయి ఎక్కువకు విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ విషయంలో అవకతవకలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత స్థానిక ఎమ్మెల్యేలదేనని స్పష్టం చేశారు. ప్రభుత్వంపై జరుగుతున్న ఫేక్ ప్రచారాలను వాస్తవాలతో - మిగతా3లో

# ఫేక్ ప్రచారాన్ని నమ్మొద్దు

## ఎంబీబీఎస్ కౌన్సెలింగ్‌లో వీలైనన్ని ఆప్షన్లు ఇచ్చుకోవాలి

## మలివిడత కౌన్సెలింగ్ 11 నుంచి ప్రారంభం

## ఎన్టీఆర్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ చంద్రశేఖర్



**(అంకుశం, అమరావతి, సెప్టెంబర్ 8):**

ఎంబీబీఎస్ కౌన్సెలింగ్‌లో అభ్యర్థులు తమ ప్రాధాన్యతకు అనుగుణంగా వీలైనన్ని ఎక్కువ సంఖ్యలో కళాశాలలు ఆప్షన్ లుగా నమోదు చేసుకోవాలని డా. ఎన్.టి.ఆర్. ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం సూచించింది. పరిమిత సంఖ్యలో కళాశాలలను మాత్రమే ఎంచుకుంటే.. ముఖ్యంగా ఓపెన్ కేటగిరీలో సీట్లు పొందే అవకాశాలు తగ్గవచ్చని తెలిపింది. అందుబాటులో ఉన్న కళాశాలలను ప్రాధాన్యత క్రమంలో ఎక్కువగా ఎంచుకోవడం ద్వారా సీటు పొందే అవకాశాలను - మిగతా2లో

# పట్టణ సేవల్లో ఏపీ అగ్రగామి

## ముంబయిలో జరిగే ఐఎఫ్‌టీ సమావేశానికి ఏపీకి ఆహ్వానం

**(అంకుశం, అమరావతి, సెప్టెంబర్ 8):**




ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పురపాలక పరిపాలన, పట్టణాభివద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్ ఈ నెల 9న ముంబయిలో జరిగే ప్రతిష్ఠాత్మక 'ఐఎఫ్‌ఏటీ ఇండియా--2026' సదస్సుకు విశిష్ట అతిథిగా, వక్తగా హాజరుకానున్నారు. ఈ సందర్భంగా పట్టణ పరివర్తన దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ఆయన వివరించనున్నారు. పుర పాలనా సంస్కరణలు, పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, సుస్థిర పట్టణ సేవల అందజేత, పట్టణ స్థానిక సంస్థల్లో సామర్థ్యాల పెంపు లక్ష్యంగా చేపట్టిన కార్యక్రమాలతో పట్టణ పరివర్తనలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామి రాష్ట్రంగా నిలిచింది. స్వచ్ఛ భారత్ మిషన్ 2.0 కింద చేపట్టిన పలు కార్యక్రమాల ద్వారా పట్టణ వ్యర్థాల నిర్వహణ, వత్తాకార ఆర్థిక వ్యవస్థ అమలులో ఆంధ్రప్రదేశ్ మార్గదర్శక రాష్ట్రంగా నిలిచింది. అలాగే, 2025 జనవరి నుంచి ప్రతి నెలా నిర్వహిస్తున్న 'స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర' కార్యక్రమం ద్వారా వ్యర్థాల నిర్వహణ పట్ల ప్రజల ప్రవర్తనలో స్పష్టమైన మార్పు వచ్చింది. పట్టణాభివద్ధి, పుర పాలన, సుస్థిర మౌలిక సదుపాయాలు, వ్యర్థాల నిర్వహణ రంగాల్లో ఆంధ్రప్రదేశ్ సాధించిన అనుభవాలు, ఆవిష్కరణలు, విజయాలను ఈ సదస్సులో ప్రముఖంగా ప్రదర్శించనున్నారు. ఘన వ్యర్థాల నిర్వహణ, పునర్వినియోగం, వత్తాకార ఆర్థిక వ్యవస్థ, నీరు, మురుగునీటి నిర్వహణకు సంబంధించిన పర్యావరణ సాంకేతికతలపై నిర్వహించే ప్రముఖ వాణిజ్య ప్రదర్శన ఐఎఫ్‌ఏటీ ఇండియా. భారతదేశ సుస్థిరత, పర్యావరణ లక్ష్యాలను వేగంగా సాధించేందుకు అవసరమైన పరిష్కారాలపై చర్చించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులు, విధాన నిర్ణేతలు, మౌలిక సదుపాయాల రంగ నిపుణులు, పట్టణ పాలనా నిపుణులు, పరిశ్రమల ప్రతినిధులు, సాంకేతిక పరిజ్ఞాన సంస్థలు, పెట్టుబడిదారులు, అభివద్ధి భాగస్వాములను ఈ వేదిక ఒక్కచోట చేర్చుతుంది.

# గణేష్ మండపాలకు విద్యుత్.. 500 వాట్లకు రూ. వెయ్యి

## -- ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి. పుల్లారెడ్డి

**(అంకుశం, అమరావతి, సెప్టెంబర్ 8):**

వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసే గణేష్ మండపాల్లో విద్యుత్ భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి. పుల్లారెడ్డి సూచించారు. భక్తితో పూజిద్దాం.. భద్రతతో పండుగ జరుపుకుందాం అని ఆయన పిలుపునిచ్చారు. మండపాల్లో విద్యుత్ అలంకరణలు, తాత్కాలిక విద్యుత్ వినియోగం విషయంలో నిర్వాహకులు అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. గణేష్ మండపాలను విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలకు తగినంత దూరంలో ఏర్పాటు చేయాలని సీఎండీ సూచించారు. మండపాల పైనుంచి విద్యుత్ తీగలు వెళ్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్ అలంకరణలకు నాణ్యమైన వైర్లు, స్విచ్‌లు, ప్లగ్‌లు మాత్రమే వినియోగించాలని తెలిపారు. మండపాలకు అనధికారికంగా విద్యుత్ కనెక్షన్లు తీసుకోవద్దని స్పష్టం చేశారు. విద్యుత్ వైరింగ్, ఇతర పనులను అర్హత కలిగిన ఎలక్ట్రీషియన్లతోనే చేయించుకోవాలని సూచించారు. అధిక లోడ్ కారణంగా ప్రమాదాలు చోటుచేసుకోకుండా తగిన సామర్థ్యం - మిగతా2లో




# పరిశ్రమల్లోని ఖాళీ స్థలాల్లో చెట్లు నాటండి

## నాటిన మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

## సమీక్షలో ఏపీ గ్రీన్ ఛైర్మన్ నాగబాబు

**(అంకుశం, అమరావతి, సెప్టెంబర్ 8):**



పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్య పరిరక్షణకు పరిశ్రమలు తమ గ్రీన్ బెల్ట్‌ను మరింత విస్తరించి, స్థానిక వక్ష జాతులతో దట్టమైన పచ్చదనాన్ని అభివద్ధి చేయాలని ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ నాగబాబు స్పష్టం చేశారు. పరిశ్రమల యాజమాన్యాలు, ఉద్యోగులు సమష్టి బాధ్యతతో నిరంతరం కషి చేసినప్పుడే పర్యావరణానికి మేలు చేసే స్థిరమైన గ్రీన్‌బెల్ట్‌ను అభివద్ధి చేయడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. మంగళవారం కాకినాడ జిల్లా తొండంగి మండలం ఒంటిమామిడి గ్రామంలోని దివిస్ లేబొరేటరీస్ ను సందర్శించి, పరిశ్రమలో కొనసాగుతున్న గ్రీన్ బెల్ట్ అభివద్ధి, ప్లాంటేషన్ కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ "పరిశ్రమలు తమ పరిధిలోని ఖాళీ ప్రదేశాలను వినియోగించుకుని గ్రీన్ బెల్ట్‌ను మరింత విస్తరించాలి. పెద్దగా పెరిగే స్థానిక వక్ష జాతులకు ప్రాధాన్యం ఇచ్చి మొక్కలు నాటాలి. అనుకూలమైన ప్రతి చోట మియావాకి పద్ధతిలో దట్టమైన వనాలను అభివద్ధి చేయాలి. పరిశ్రమలలో అందుబాటులో ఉన్న ఖాళీ స్థలాలన్నింటినీ దశలవారీగా హరిత వనాలుగా మార్చాలి. నాటిన మొక్కల సంరక్షణ, మనుగడపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి" అన్నారు. అంతకు ముందు నాగబాబు దివీస్ పరిశ్రమ ప్రాంగణాన్ని సందర్శించి, ఇప్పటికే అభివద్ధి చేసిన గ్రీన్ బెల్ట్, మొక్కలు నాటిన ప్రాంతాలను పరిశీలించారు. అలాగే భవిష్యత్‌లో మరింత హరిత ప్రాంతంగా అభివద్ధి చేసేందుకు అందుబాటులో ఉన్న ఖాళీ స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పరిశ్రమ ప్రతినిధులు ప్రస్తుతం చేపడుతున్న ప్లాంటేషన్ కార్యక్రమంతోపాటు, భవిష్యత్‌లో గ్రీన్ బెల్ట్‌ను మరింత విస్తరించేందుకు రూపొందించిన ప్రణాళికలను నాగబాబుకు వివరించారు. అనంతరం దివిస్ లేబొరేటరీస్‌కు చెందిన ఉద్యోగులతో కలిసి నాగబాబు మొక్కలు నాటారు.

# కూడేరు మండలంలో చెరువులను తక్షణం హంద్రీ-నీవా నీటితో నింపాలి....

**అంకుశం న్యూస్, అనంతపురం, సెప్టెంబర్ : 8** దేశంలో అత్యల్ప వర్షపాతం,అంటే 500 మిల్లీమీటర్లు పడే జిల్లాగా అనంతపురం జిల్లా ప్రసిద్ధికెక్కితే,అదే జిల్లాలో మరింత తక్కువ వర్షం అనగా 350 మిల్లీ మీటర్లు మాత్రమే కురిసే మండలంగా ఉరవకొండ నియోజకవర్గం పరిధియందు గల కూడేరు మండలం ప్రసిద్ధికెక్కింది. ఈ సంవత్సరం సూపర్ ఎల్ నినో ప్రభావంతో జిల్లాలో 52 శాతం తక్కువ వర్షపాతం అంటే కేవలం 250 మిల్లీమీటర్లు మాత్రమే జిల్లాలో కురిస్తే,ఆ దామాషా ప్రకారం కూడేరు మండలంలో కేవలం 150 మిల్లీమీటర్లు మాత్రమే వర్షం పడింది. దీనిని బట్టి అక్కడ నీటి తీవ్రత ఎంత భయంకరంగా ఉంటుందో ఊహించ వచ్చు. కూడేరు మండల పరిధియందు గల రైతుల పరిస్థితి ఆగమ్య గోచరం సెప్టెంబర్ నెల వచ్చినా వర్షపు జాడలేదు. హంద్రీ-నీవా రెండవ దశ కింద ఈ మండలం ఉన్నప్పటికీ కాల్వకు లైనింగ్ చేయడం ద్వారా భూగర్భ జలాలు ఇంకిపోయి,అటు మెట్టపొలాల్లో పంటలు లేక,ఇటు బోర్లు ఎండి పోయి,పండ్ల తోటలను ఎలా కాపాడుకోవాలో అర్థం గాక రైతులు తల పట్టుకుంటున్నారు. హార్టికల్చర్ హబ్‌గా మారుతున్న ఈ మండలంలో పరిస్థితి దారుణంగా ఉంది,కన్న బిడ్డలా పెంచుకున్న పండ్ల తోటలను కాపాడుకోవడానికి రైతులు ట్యాంకర్లతో నీళ్లు తెప్పించుకుంటున్నారు.ఒక్కో ట్యాంకర్‌కు ?600 ఖర్చు చేస్తున్నారు.ఒక్కసారి కాదు,ఒక్కరోజు కాదు



పంట చేతికొచ్చే వరకు ఈ ఖర్చు భరించడం రైతులకు సాధ్యం కాదు, మరోవైపు మనుషులకు,పశువులకు కూడా తాగునీటి కష్టాలు తీవ్రమైనాయి. అని ఉరవకొండ మాజీ శాసనసభ్యులు విశ్వేశ్వర రెడ్డి జిల్లా కలెక్టర్ కి వినతి పత్రం అందజేశారు.

## వైసీపీకి రాజీనామా చేసిన బొత్స మేనల్లుడు చిన్న శ్రీను

వైసీపీలో కీలక పరిణామం చోటుచేసుకుంది. పార్టీ సీనియర్ నేత, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మేనల్లుడు, విజయనగరం జిల్లా వైసీపీ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన తన రాజీనామా లేఖను వైసీపీ అధినేత జగన్ కు పంపించారు. ఈ పరిణామం ఉత్తరాంధ్ర వైసీపీ శ్రేణులకు పెద్ద ఎదురుదెబ్బగా మారింది.

మజ్జి శ్రీనివాసరావు తన రాజీనామా లేఖలో పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు, తాను నిర్వహిస్తున్న విజయనగరం జిల్లా అధ్యక్ష పదవి, భీమిలి నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జ్ బాధ్యతల నుంచి కూడా వైదొలగుతున్నట్లు స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆయన విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా కూడా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. బొత్స కుటుంబానికి అత్యంత సన్నిహితుడిగా, జిల్లాలో పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా వ్యవహరించే చిన్న శ్రీను అకస్మాత్తుగా ఈ నిర్ణయం తీసుకోవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

బొత్స సత్యనారాయణ కుటుంబానికి ఉత్తరాంధ్రలో గట్టి పట్టుంది. అలాంటి కీలక నేత మేనల్లుడే పార్టీని వీడటం వైసీపీకి తీవ్ర నష్టంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. జిల్లాలో కీలకమైన జడ్పీ ఛైర్మన్ పదవిలో ఉంటూ, జిల్లా పార్టీ అధ్యక్షుడిగా ఉన్న నేత రాజీనామా చేయడం వెనుక కారణాలపై పార్టీ వర్గాల్లో భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. అయితే, తన రాజీనామాకు గల కారణాలను చిన్న శ్రీను ఇంకా అధికారికంగా వెల్లడించలేదు. ఆయన భవిష్యత్ కార్యాచరణ ఏమిటనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## ఉల్లి ఘాటు, చికెన్ జోరు..

సామాన్యుడి వంటింటి బడ్జెట్‌పై ధరల భారం మరోసారి పెరిగింది. ఆగస్టు నెలలో గృహావసర భోజనం ఖర్చులు స్వల్పంగా పెరిగినట్లు ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ 'క్రిసిల్' తన తాజా నివేదికలో వెల్లడించింది. ముఖ్యంగా ఉల్లిపాయలు, వంట నూనెలు, బ్రాయిలర్ చికెన్ ధరలు పెరగడమే ఇందుకు ప్రధాన కారణమని పేర్కొంది.

క్రిసిల్ 'రోటీ రైస్ రేట్' నివేదిక ప్రకారం, గత ఏడాదితో పోలిస్తే శాకాహార భోజనం (వెజ్ థాలీ) ధర 1 శాతం పెరిగి రూ. 29.5కి చేరింది. అదే సమయంలో, మాంసాహార భోజనం (నాన్-వెజ్ థాలీ) ధర 5 శాతం పెరిగి రూ. 57.5కు చేరింది. అయితే, జూలై నెలతో పోల్చితే నాన్-వెజ్ థాలీ ధర 1 శాతం తగ్గడం గమనార్హం.

ఈ ధరల పెరుగుదలకు ప్రధానంగా ఉల్లి ధరలు ఏకంగా 43 శాతం మేర పెరగడమే ముఖ్య కారణం. మార్చి-ఏప్రిల్ నెలల్లో మహారాష్ట్రలో కురిసిన అకాల వర్షాలు, వడగళ్ల వానల ప్రభావంతో సరఫరా తగ్గి ఉల్లి ధర కిలోకు రూ. 40కి చేరింది. వీటికి తోడు వంట నూనెల ధరలు 11 శాతం, ఎల్‌పీజీ ధరలు 10 శాతం, బ్రాయిలర్ చికెన్ ధరలు 10 శాతం మేర పెరిగాయి. నాన్-వెజ్ థాలీ ప్రియం కావడంలో చికెన్ ధరల పెరుగుదల కీలక పాత్ర పోషించింది.

మరోవైపు బంగాళాదుంపల ధరలు 12 శాతం, టమాటా ధరలు 28 శాతం మేర తగ్గడంతో వెజ్ థాలీ ధరలు మరింత పెరగకుండా కొంతమేర అదుపులో ఉన్నాయి. ఇక జూలై నెలతో పోలిస్తే, శ్రావణ మాసం కారణంగా చికెన్ వినియోగం తగ్గి బ్రాయిలర్ ధరలు 4 శాతం మేర క్షీణించాయి. దీంతో నాన్-వెజ్ థాలీ ధరలో స్వల్ప తగ్గుదల కనిపించింది. అయితే, రబీ పంట సరఫరా తగ్గడం, ఖరీఫ్ పంట రాక ఆలస్యం కావడం వల్ల రాబోయే రెండు మూడు నెలల పాటు ఉల్లి ధరలు అధికంగానే ఉండే అవకాశం ఉందని క్రిసిల్ మార్కెట్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ పుషన్ శర్మ అంచనా వేశారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిలపై సస్పెన్షన్ వేటు

బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ సమావేశాల కాలం మొత్తం వారిని సస్పెండ్ చేస్తున్నట్లు మండలి ఛైర్మన్ ప్రకటించారు. అసెంబ్లీ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ తాతా మధు, నవీన్ కుమార్‌లపై కాంగ్రెస్ పక్షం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.

తీర్మానం ప్రవేశపెట్టిన దామోదర

స్పీకర్‌పై అగౌరవంగా మాట్లాడటంతో పాటు, అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్ నేతల ప్రవర్తనపై ప్రభుత్వం సీరియస్ అయింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంత్రి దామోదర రాజనర్సింహ శాసనసభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష నేత కేసీఆర్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కూడా ఆయన డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి దామోదర మాట్లాడుతూ, ఎస్సీల చరిత్ర జాతీయ ఆత్మగౌరవంతో ముడిపడి ఉందని, దానిని కేవలం ఒక సామాజిక వర్గానికే పరిమితం చేయకూడదని అన్నారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమని, కానీ రాజ్యాంగబద్ధమైన పదవులను, వ్యవస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంటుందని స్పష్టం చేశారు. "స్పీకర్ పదవి ఏ ఒక్క కులానికో, మతానికో సంబంధించినది కాదు. ఆ అత్యున్నత పదవిలో ఉన్న వ్యక్తిని అవమానించడం క్షమించరాని నేరం" అని ఆయన వ్యాఖ్యానించారు. అధికారం కోల్పోయినప్పటికీ బీఆర్ఎస్ నేతల అహంకారం తగ్గలేదని, ప్రజాజీవితంలో ఉన్నవారు బాధ్యతాయుతంగా మెలగాలని సూచించారు.

మంత్రి దామోదర ప్రవేశపెట్టిన తీర్మానానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పూర్తి మద్దతు తెలిపారు. రాజ్యాంగ వ్యవస్థల గౌరవాన్ని కాపాడేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. అసెంబ్లీలో ఈ తీర్మానం ఆమోదం పొందిన అనంతరం, అధికారిక కాపీని శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి పంపించారు. దీంతో నిబంధనలు ఉల్లంఘించిన ఇద్దరు ఎమ్మెల్సీలపై మండలిలో చర్యలు తీసుకున్నారు.

## ఫేక్ ప్రచారాన్ని నమ్మొద్దు

-మొదటిపేజీ తరువాయి

పెంచుకోవచ్చని స్పష్టం చేసింది. విశ్వవిద్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఉపకులపతి డా. పి. చంద్రశేఖర్, రిజిస్ట్రార్ డా. టి. సాయి సుధీర్ కౌన్సెలింగ్ ప్రక్రియపై వివరాలు వెల్లడించారు. ఎంబీఎస్ తరగతులను ఈ నెల 15 వ తారీకు నుంచి ప్రారంభిస్తున్నామని తెలిపినారు. 2026--27 విద్యా సంవత్సరానికి కన్వీనర్ కోటా ఎంబీబీఎస్ సీట్లకు సంబంధించిన తొలి దశ కౌన్సెలింగ్ పూర్తయింది. మొత్తం 4,581 సీట్లలో 4,321 సీట్లు కేటాయించారు. కేటాయింపులు పొందిన వారిలో 4,231 మంది గడువులోపు తమకు కేటాయించిన కళాశాలల్లో చేరారు. 90 మంది చేరలేదు. ప్రస్తుతం జాతీయ కోటా రెండో దశ కౌన్సెలింగ్ సెప్టెంబరు 3 నుంచి 11 వరకు కొనసాగుతోంది. ఇది పూర్తయిన అనంతరం రాష్ట్ర కోటా రెండో దశ కౌన్సెలింగ్‌ను సెప్టెంబరు 11 నుంచి ప్రారంభించాలని సూత్రప్రాయంగా నిర్ణయించాము. ఈ దశలో కూడా మళ్ళీ అభ్యర్థుల నుంచి ఆప్షన్ లను స్వీకరిస్తాం. అదే సమయంలో ఎక్కువ కళాశాలలను ఎంపికలుగా ఎంచుకున్న కొందరు అభ్యర్థులు ఓపెన్ కేటగిరీలో సీట్లు పొందారు. బీసీ--ఏ కేటగిరీకి చెందిన ఓ అభ్యర్థి 19 కళాశాలలు, బీసీ--బీ అభ్యర్థి 36, బీసీ--డీ అభ్యర్థి 37 కళాశాలలు ఎంపికలుగా నమోదు చేసి ఓపెన్ కేటగిరీలో సీట్లు పొందినట్లు అధికారులు తెలిపారు. దీనిపై ఎవరికయినా సందేహాలు ఉంటె నివత్తి చేసేందుకు సిద్ధముగా ఉన్నామని తగిన ఆధారాలు ఉంటె చూపించాలని అధికారులు స్పష్టం చేసారు.

## గణేష్ మండపాలకు విద్యుత్.. 500 వాట్లకు రూ. వెయ్యి

-మొదటిపేజీ తరువాయి

కలిగిన వైరింగ్, రక్షణ పరికరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.వర్షాల సమయంలో విద్యుత్ పరికరాలు, వైర్లు తడవకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని పుల్లారెడ్డి సూచించారు. తడిసిన విద్యుత్ పరికరాలను చేతితో తాకరాదని హెచ్చరించారు. విద్యుత్ తీగలు తెగిపడినా, వేలాడుతున్నా వాటికి దూరంగా ఉండి వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని లేదా 1912 టోల్ ఫ్రీ నెంబర్ కు తెలియజేయాలని కోరారు.మండపాల వద్ద విద్యుత్ అలంకరణలు ఏర్పాటు చేసే సమయంలో భక్తులు, ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని తెలిపారు. అత్యవసర వాహనాలు, సేవలకు ఆటంకం కలగకుండా మండపాల నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 26వ తేదీ వరకు గణేష్ మండపాలకు తాత్కాలిక విద్యుత్ సరఫరా అందించనున్నట్లు సీఎండీ పి. పుల్లారెడ్డి తెలిపారు. 500 వాట్లకు రూ.1,000 1,000 వాట్లకు రూ.2,250 చెల్లించాలని సూచించారు. దీనికి అదనంగా దరఖాస్తు రుసుము రూ.100గా నిర్ణయించినట్లు తెలిపారు.

## తిరుమల ఆలయంలో ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



**అంకుశం న్యూస్ తిరుమల సెప్టెంబర్ 8** తిరుమల శ్రీవారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా జరిగింది. టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు, టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, ఆలయ అర్చకులు, అధికారులు, సిబ్బంది ఆలయ శుద్ధి కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అదనపు ఈవో మీడియాతో మాట్లాడుతూ సెప్టెంబరు 15 నుండి 23వ తేదీ వరకు శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగనున్నాయని, ఇందుకు అవసరమైన ఏర్పాట్లన్ని పూర్తి చేసినట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాలు, ఉగాది, ఆణివార ఆస్థానం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు వచ్చే మంగళవారం ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆగమానుసారంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఆలయంలోని ఆనందనిలయం మొదలుకొని బంగారువాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉప దేవాలయాలు, ప్రసాదాల పోటు, ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పుతోపాటు పూజాసామగ్రిని శుద్ధి చేసినట్టు తెలిపారు.

కాగా, ఆలయంలో ఉదయం 6 నుండి ఉదయం 10 గంటల వరకు శుద్ధి కార్యక్రమాన్ని అర్చకులు ఆగమోక్తంగా నిర్వహించారు. ఈ సమయంలో స్వామివారి మూలవిరాట్టును వస్త్రంతో పూర్తిగా కప్పి వేశారు. శుద్ధి పూర్తి అయిన అనంతరం నామకోపు, శ్రీ చూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం స్వామివారి మూలవిరాట్టుకు కప్పిన వస్త్రాన్ని తొలగించి ప్రత్యేక పూజ, నైవేద్యం కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆ తరువాత భక్తులను దర్శనానికి అనుమతించారు.

ఈ కార్యక్రమంలో పలువురు బోర్డు సభ్యులు, సీవీఎస్వో మురళీకృష్ణ, డిప్యూటీ ఈవో భాస్కర్, తదితర అధికారులు పాల్గొన్నారు.

## 11న మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు



**బుక్కరాయసముద్రం అంకుశం న్యూస్ సెప్టెంబర్ 8** జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరుగు మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలను ఈనెల 11న బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని గిరిజన గురుకుల రెసిడెన్షియల్ స్కూల్ లో నిర్వహిస్తున్నట్లు జెవివి మండల కన్వీనర్ అర్జున్ నాయక్ తెలియజేశారు.ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎం.గేయానంద్ హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు.ఆగస్టు 27న,పాఠశాల స్థాయిలో జరిగిన చెకుముకి సైన్స్ సంబరాలలో 8,9,10వ తరగతిలో మొదటి స్థానంలో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఒక టీం గా ఏర్పడి మండల స్థాయిలో జరిగే సంబరాలలో పాల్గొంటారని అన్నారు.మండలం నుంచి మొత్తం 15 టీంలు మండల స్థాయికి ఎంపికయ్యాయని వారంతా రెసిడెన్షియల్ స్కూల్లో జరిగే పోటీలలో పాల్గొంటున్నట్లు తెలిపారు.పాఠశాల స్థాయి విద్యార్థులలో సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించి వారిలో సృజనాత్మకతను వెలికితీయాలనే ఉద్దేశంతో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గత 38 సంవత్సరాలుగా రాష్ట్రవ్యాప్తంగా చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నామని ఇందులో విద్యార్థులు ఎంతో ఆసక్తితో పాల్గొంటున్నట్లు ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు.

## పూల శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీని వీడి వైసీపీలోకి 12 కుటుంబాలు చేరిక



అంకుశం న్యూస్,తలుపుల,సెప్టెంబర్:8:వైయస్ఆర్ సీపీ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి ఏ కష్టం వచ్చిన,నష్టం వచ్చిన తోడుగా అండగా నేనుంటానని భరోసా కల్పించిన పూల శ్రీనివాస్ రెడ్డి.2029లో జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవడమే నా లక్ష్యం అని ఈ సందర్భంగా తెలియజేశారు.ప్రజల సంక్షేమం రాష్ట్ర అభివృద్ధి వైఎస్ జగన్ గారితోనే సాధ్యమని కదిరి నియోజవర్గంలో ఇంక చాలా కుటుంబాలు టిడిపిని వీడి వైసీపీలో చేరడానికి సిద్ధంగా ఉన్నాయని పూల శ్రీనివాస్ రెడ్డి తెలియజేశారు.కదిరి నియోజకవర్గం తలుపుల మండలంలోని టిడిపికి చెందిన 12 కుటుంబాలు రాష్ట్ర కార్యదర్శి పూల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వైసిపి తీర్థం పుచ్చుకున్నాయి.టిడిపి పార్టీని వీడి వైసీపీలోకి చేరిన వారికి పూల శ్రీనివాస్ రెడ్డి గారి స్వగృహం నందు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు.పార్టీలో చేరిన వారికి ఏ కష్టం వచ్చినా ఏ నష్టం వచ్చిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరఫున మీకు మీ కుటుంబాలకి తోడుగా అండగా నేనుంటానని పూల శ్రీనివాసరెడ్డి గారు హామీ ఇచ్చారు.చంద్రబాబు అబద్ధపు హామీలు,అమలు చేయలేని పథకాలను ఇస్తానని ప్రజలను మోసం చేశారని,ప్రజలకు మంచి జరగాలన్న రాష్ట్రం,అభివృద్ధి పథంలో నడవాలన్నా వైయస్ జగన్ తోనే సాధ్యమని పూల శ్రీనివాసరెడ్డి తెలియజేశారు.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ లోకి చేరడం చాలా సంతోషంగా ఉందని పూల శ్రీనివాస రెడ్డి కదిరిలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు,నాయకులకు ప్రజలకి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటున్నారని,వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సంబంధించిన కార్యకర్తలు,నాయకులు కుటుంబంలో ఏ కార్యక్రమాలు జరిగిన పూల శ్రీనివాస్ రెడ్డి హాజరవుతున్నారని నియోజకవర్గంలో కార్యకర్తలకు ఎటువంటి ఇబ్బందులు వచ్చిన పూల శ్రీనివాసరెడ్డి ముందుంటున్నారని ఇలాంటి వారి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరడం అదృష్టంగా భావిస్తున్నామని వైసీపీలోకి చేరిన కుటుంబ సభ్యులు తెలియజేశారు.

## 13 వ జాతీయ స్థాయి కరాటే పోటీల్లో జైన్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ



**అంకుశం న్యూస్,కదిరి,సెప్టెంబర్:8:** ఇటీవల 6 వ తేదీ ఆదివారం కర్నూలు పట్టణం లోని పుష్ప రాజ్ కళ్యాణ మండపంలో జాతీయస్థాయి కరాటే పోటీలు జరిగాయి.ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీ సత్య సాయి జిల్లా కదిరి జైన్ పాఠశాల విద్యార్థులు 8 మంది విద్యార్థులు కటా,కుమిటే 16 విభాగాలలో పోటీ చేయగా 7 బంగారు,3 వెండి,4 కాంశ్య పథకాలు మొత్తం 14 పథకాలను సాధించారు.వివరాలు జైన్ పాఠశాలలో యూకేజీ చదువుతున్న ఆద్య వెండి,కాంశ్య పతకాలను,హన్వి బంగారు,కాంశ్య పతకాలను,జస్వి రెండు వెండి పతకాలను,రీదా ముస్కాన్ బంగారు పతకాన్ని,గగన్ రెండు బంగారు పతకాలను,ఫర్హాన్ 2 బంగారు పతకాలను,ఆఫ్నాన్ బంగారు పతకాన్ని, రబ్బన్ రెండు కాంస్య పథకాలను సాధించారు.ఈ కార్యక్రమంలో మెడల్స్ సాధించిన విద్యార్థిని విద్యార్థులకు వారి పాఠశాల ప్రధానోపాధ్యాయులుబాలాజీ,సమన్వయకర్త భాగ్యలక్ష్మి,విద్యార్థులకు మెడల్స్ ప్రశంస పత్రాన్ని అందజేస్తూ విద్యార్థులకు,కరాటే మాస్టర్ షాకీర్ కి అభినందనలు తెలియజేశారు.

## విజయవాడ లో డా. సమరంను సన్మానించిన ధర్మవరం గొడుగు నాగరాజు



**అంకుశం న్యూస్ ధర్మవరం సెప్టెంబర్ 8** గొడుగు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విజయవాడ డాక్టర్ రెడ్ క్రాస్ సంస్థ నిర్వాహకులు ప్రముఖ డా.సమరం గారిని సన్మానం సార్ గారిని కలిసి ప్రోగ్రాం గురించి చర్చించి మీసేవ కార్యక్రమాలకు మా తోడు ఉంటుందని హామీ ఇచ్చినాడు కార్యక్రమం చేయడం గొడుగు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గొడుగు నాగరాజు సలహాదారుడు మోగముని తదితరులు పాల్గొన్నారు.

# బిక్కవోలులో వైయస్ఆర్‌సీపీ సమర శంఖారావం





హాజరైన అశేష జనసందోహం

బలభద్రపురంలో వైయస్ఆర్‌సీపీ సమాయత్త సమావేశం

కూటమి నాయకుల అవినీతి, దౌర్జన్యాల వీడియోను ప్రదర్శించిన మాజీ ఎమ్మెల్యే

ఎన్ని దాడులు చేసినా వైయస్ఆర్‌సీపీ శ్రేణులను ఏమీ చేయలేరు:మాజీ ఎమ్మెల్యే భరోసా

**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ సెప్టెంబర్ 08:** బిక్కవోలు మండలం బలభద్రపురం గ్రామంలోని మీా= ఫంక్షన్ హాల్ నందు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల సమాయత్త సమావేశం వైయస్ఆర్‌సీపీ ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా జరిగింది. పలువురు ముఖ్య నాయకులు హాజరైన సందర్భంగా అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి పటిష్టమైన కార్యాచరణ రూపొందించుకోవడంతో పాటు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ాx=) ప్రక్రియ, పార్టీ ఐడీ కార్డుల పంపిణీ, వెన్నుపోటు పార్టీ -- వెన్నుపోటు పాలన అంశాలపై విస్తృతంగా చర్చించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని వివరించారు. అనపర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, ఆయన కుమారుడు మనోజ్ ఆధ్వర్యంలో జరిగిన దౌర్జన్యాలు, దాడులు, అరాచకాలు మరియు అవినీతిని నియోజకవర్గ ప్రజలంతా గమనించారని, ఎన్ని దాడులు చేసినా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులను, కార్యకర్తలను ఏమీ చేయలేరని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికలలో వైయస్ఆర్‌సీపీ అఖండ మెజారిటీతో మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. వైయస్ఆర్‌సీపీ శ్రేణులపై అన్యాయంగా, అక్రమంగా దాడులకు పాల్పడుతున్న కూటమి పార్టీ నాయకులను, కార్యకర్తలను భవిష్యత్తులో చట్ట ప్రకారం కఠినంగా శిక్షిస్తామని పేర్కొంటూ పార్టీ కార్యకర్తలకు ఆయన పూర్తి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రులు బొత్స సత్యనారాయణ , గుడివాడ అమర్నాథ్ , చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ , తానేటి వనిత , మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి , జక్కంపూడి రాజా , తలారి వెంకటరావు , గెడ్డం శ్రీనివాస నాయుడు, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్, రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గ కోఆర్డినేటర్ గూడూరి శ్రీనివాస్ మరికొందరు ముఖ్యనేతలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విధుల్లో సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలి

## మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి



**అంకుశం న్యూస్,పుట్టపర్తి, సెప్టెంబర్:8:** ప్రభుత్వ ఉద్యోగులు విధుల్లో సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని టీడీపీ పుట్టపర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ప్రభుత్వ సచివాలయ ఉద్యోగులకు సూచించారు.పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లి,బ్రాహ్మణపల్లి,ప్రశాంతి గ్రామం లోని సచివాలయాలను మంగళవారం మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి సందర్శించి అక్కడ ప్రజలకు అందుతున్న సేవ కార్యక్రమాలను సచివాలయ సిబ్బంది తో అడిగి తెలుసుకున్నారు.కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తుల నమోదు ప్రక్రియను మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పరిశీలించారు.ఈ సందర్భంగా సచివాలయ సిబ్బందితో మాట్లాడి దరఖాస్తుల స్వీకరణ,అర్హతల పరిశీలన,లబ్ధిదారులకు అందుతున్న సేవలపై వివరాలు ఆయన తెలుసుకున్నారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా క్షేత్రస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది బాధ్యతతో పనిచేయాలని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి అన్నారు.ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం సచివాలయాలకు వచ్చినప్పుడు వారిని గౌరవంగా స్వీకరించి,నిబంధనల ప్రకారం త్వరితగతిన సేవలు అందించాలని సూచించారు.ప్రభుత్వ పథకాలు,సంక్షేమ కార్యక్రమాల అమలులో సచివాలయ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు.అధికారులు,సిబ్బంది సమర్థవంతంగా పనిచేసినప్పుడే ప్రభుత్వానికి ప్రజల్లో మంచి పేరు వస్తుందని తెలిపారు.“పేదలు, అర్హులైన ప్రజలకు సేవ చేసే అవకాశం ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి దేవుడిచ్చిన వరంగా భావించాలి.ప్రజలకు సేవ చేయడమే ప్రభుత్వ ఉద్యోగుల ప్రధాన బాధ్యత” అని డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి అన్నారు.అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ ఫలాలు అందేలా పారదర్శకంగా పనిచేయాలని,ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి వెంట రాష్ట్ర టీడీపీ కార్యనిర్వహక కార్యదర్శి సామకోటి ఆదినారాయణ,శుభచంద్ర,టిడిపి నాయకులు బోయ రామాంజనేయులు, రామారావు లక్ష్మీపతి, గంగాధర్ నాయుడు, ఉమాపతి ,అంబులెన్స్ రమేష్,కృష్ణప్రసాద్ , సురేష్,పుట్టపర్తి మున్సిపాలిటీ చెందిన టిడిపి ప్రజాప్రతినిధులు కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించిన మంత్రి సుభాష్



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ సెప్టెంబర్:** కృష్ణాజిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ నివాసంలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కృష్ణాజిల్లా ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలతో డిన్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి జిల్లాలో రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం, క్షేత్రస్థాయిలో సమన్వయం, ఎన్నికల వ్యూహాలపై ప్రజాప్రతినిధులతో మంత్రి సుభాష్ చర్చించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కృష్ణాజిల్లాలో కూటమి పార్టీ మరింత బలోపేతం కావడానికి తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణుల మధ్య నిరంతర సమన్వయం ఉండాలని మంత్రి సుభాష్ గారు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కృష్ణా జిల్లా అధ్యక్షులు గురుమూర్తిగారు, ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

## రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే



**అంకుశం న్యూస్ ఉరవకొండ సెప్టెంబర్ 8 :** ఉరవకొండ మండల పరిధిలోని రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి పావని ఆధ్వర్యంలో మంగళవారం ఆశా డే కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవితంలో అన్ని దశల్లో తీసుకోవలసిన పోషకాహారం,స్థానికంగా లభించే చావకగా లభించే ఆహారం పదార్థలను వినియోగించి ఆరోగ్యం మెరుగు పరుచుకొనే విధానం గురించి వివరించారు.ఆహారంలో వైవిద్యం పాటించాలని అన్ని రకాల ఆహార పదార్థాలు ఉండేలా చూడాలని సూచించారు. సమాజంలో అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కలిగించాలని ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు,బాలింతలు,కిశోర బాలబాలికలకు అవగాహన కలిగించాలని అన్నారు. రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాన్పులు చేస్తారని ఈ అవకాశం చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సి హెచ్ ఓ నాగరంగయ్య,డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఎస్ఎండి.షఫీ మాట్లాడుతూ బాల్య వివాహాలు జరగకుండా చూడాలని,లింగవివక్ష పాటించకుండా, బ్రున హత్యలు జరగకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్వాజర్లు శేఖర్,స్వర్ణలత సిహెచ్వోలు, ఎమ్మెల్ హెచ్ పిలు,ఎఎన్ఎమ్ లు,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతుల సమస్యలపై కేతిరెడ్డి గుడ్ మార్నింగ్....



**అంకుశం న్యూస్ ధర్మవరం సెప్టెంబర్ 8** ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట రామిరెడ్డి మంగళవారం గుడ్ మార్నింగ్ కార్యక్రమం ధర్మవరం నియోజకవర్గం బత్తలపల్లి మండలం ముషూరు గ్రామం లో నిర్వహించడం జరిగింది. గ్రామంలో ఆయన పర్యటన లో గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వైసిపి నాయకులు కార్యకర్తలు వున్నారు.పలువురు రైతులు పాల్గొన్నారు.

## నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలి: మార్గాని భరత్



ఆంధ్రప్రదేశ్ డీఎస్సీ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో భారీ ఎత్తున అక్రమాలు జరిగాయని, దీనికి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని వైసీపీ మాజీ ఎంపీ మార్గాని భరత్ డిమాండ్ చేశారు. విజిలెన్స్ విచారణ జరుగుతోందని అధికారులు చెప్పారని... దీని అర్థం డీఎస్సీలో అక్రమాలు జరిగాయని చెప్పడమే అని అన్నారు. విజిలెన్స్ పేరుతో కాలయాపన చేయకుండా ఈ కుంభకోణం వెనుక ఉన్న అసలు సూత్రధారులను బయటకు తీసేందుకు సీబీఐ చేత సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. స్పోర్ట్స్ కోటా కింద కేటాయించిన 382 ఉద్యోగాలను ఎవరికి ఇచ్చారో పూర్తి వివరాలను పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని, నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన వారిపై ఎలాంటి చర్యలు ఎందుకు తీసుకోలేదని మార్గాని భరత్ నిలదీశారు. జూడో అసోసియేషన్ ఛైర్మన్‌గా ఉన్న లోకేశ్ తోడల్లుడు శ్రీభరత్ పైనా ఆరోపణలు చేస్తూ... పక్కా ప్రణాళిక ప్రకారమే ఈ అక్రమాలు జరిగాయని విమర్శించారు. అసెంబ్లీని, ప్రజలను పచ్చి అబద్ధాలతో తప్పుదోవ పట్టించిన లోకేశ్ కి జగన్‌ను విమర్శించే స్థాయి లేదన్నారు. “లోకేశ్ ఎమ్మెల్యే కాకముందే నేను ఎంపీగా గెలిచాను. డీఎస్సీ అక్రమాలపై లోకేశ్ తో ఎక్కడైనా చర్చకు నేను సిద్ధం. కరకట్ట నివాసమైనా, హైదరాబాద్ ఇల్లయినా తేదీ, సమయం ఆయనే ప్రకటించాలి” అని బహిరంగ సవాల్ విసిరారు.

## రీ సర్వే పనులు వేగంగా పూర్తి చేయండి

**గుమ్మగట్ట మండలంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ విస్తృత పర్యటన..**



**అంకుశం న్యూస్అనంతపురం, సెప్టెంబర్ 08 :** అనంతపురం జిల్లాగుమ్మగట్ట మండలంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ విస్తృతంగా పర్యటించారు. మంగళవారం గుమ్మగట్ట మండలంలోని తాళ్లకెర గ్రామంలో 6వదశ కింద చేపట్టిన రీసర్వే పనులను జాయింట్ కలెక్టర్ క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. రీసర్వే పనులను వేగవంతంగా చేపట్టాలని, గడువులోపు అన్ని పనులను పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం మండలంలోని భైరవానితిప్ప ప్రాజెక్టును జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. బిటి ప్రాజెక్టు గురించి పూర్తి వివరాలను అధికారులతో జాయింట్ కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. తదనంతరం గుమ్మగట్ట మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని జాయింట్ కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీల పురోగతి, రీసర్వే పనులు, మ్యుటేషన్ దరఖాస్తుల పరిష్కారం, తదిదర అంశాలపై తహసిల్దార్, అధికారులతో సమీక్ష చేసి వేగవంతంగా దరఖాస్తులను పరిష్కారం చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్ కుమార్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## టీటీడీకి రూ.10 లక్షలు విరాళం



**అంకుశం న్యూస్ తిరుపతి సెప్టెంబర్ 8** టీటీడీ బోర్డు సభ్యులు శ్రీ దర్శన్ సతీమణి శ్రీమతి యశోద దర్శన్ టీటీడీ శ్రీ వేంకటేశ్వర గో సంరక్షణ ట్రస్టుకు మంగళవారం రూ.10 లక్షలు విరాళంగా అందించారు. ఈ మేరకు దాతలు శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి విరాళం డీడీని అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ జేఈవో డాక్టర్ శరత్ పాల్గొన్నారు.

## లీడర్షిప్ కాంక్లేవ్ కార్యక్రమంలో పాల్గొన్న అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి



**అంకుశం న్యూస్,అనంతపురం,సెప్టెంబర్:8:** మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు,ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్,మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో రెండవ రోజు జరుగుతున్న టిడిపి లీడర్షిప్ కాంక్లేవ్ కార్యక్రమంలో సహచర ప్రజా ప్రతినిధులతో కలిసి పాల్గొన్న అనంతపురం శాసనసభ్యులు దగ్గుపాటి ప్రసాద్.

## ఒడిస్సా రాష్ట్రంలో తెలుగు ప్రాంత రైతులకు అండగా ఎంపీ, ఎమ్మెల్యే





**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ సెప్టెంబర్ 08:** ఒడిశాలో వరి సాగు చేస్తున్న పలువురు తెలుగు రైతులు రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల తెలుగు రైతులు ఒడిస్సా రాష్ట్రంలో తాము పండిస్తున్న వరి పంటను అక్కడి ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదంటూ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని కలవడం జరిగింది. వెంటనే ఎమ్మెల్యే నల్లమిల్లి స్పందించి ఎంపీ పురంధేశ్వరి దృష్టికి తీసుకెళ్లి ఒడిశా ప్రభుత్వ అధికారులతో మాట్లాడించి ధాన్యం కొనుగోలు చేసే విధంగా ఒప్పించడం జరిగింది.దీంతో ఒడిశా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు ప్రారంభించడంతో 50 వేలమంది తెలుగు ప్రాంత రైతులకు ఊరట లభించింది.ఈ సందర్భంగా ఒడిశాలోని తెలుగు ప్రాంత రైతుల సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ని సత్కరించి తెలుగు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

## రామ్మోహన్ లైబ్రరీకి స్వర్గీయ డాక్టర్ ఆకుల రాజ్ కుమార్ పేరిట

# మెడికల్ పుస్తకాల బహుకరణ

**సామాజిక సేవకు డాక్టర్లు అంకితం కావాలని కోరిన ఆకుల శ్రీనివాస్**



**అంకుశం న్యూస్ విజయవాడ సెప్టెంబర్ 8 :** అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా సీనియర్ రాజకీయ నాయకులు, ప్రముఖ సామాజిక వేత్త ఆకుల శ్రీనివాస కుమార్ తన కుమారుడు స్వర్గీయ డాక్టర్ ఆకుల రాజ్ కుమార్ జ్ఞాపకార్థం బందరు లాకుల వద్ద ఉన్న అటల్ బిహారీ వాజ్‌పేయి విజ్ఞాన కేంద్రంలోని రామ్మోహన్ గ్రంథాలయానికి ఎంతో విలువైన మెడికల్, ఎంబీబీఎస్‌కు సంబంధించిన పుస్తకాలను అందజేశారు.రామ్మోహన్ గ్రంథాలయ అధ్యక్షులు చింతలపూడి కోటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ రామచంద్ర రావు, సెక్రటరీ వేములపల్లి శంకర్రావులకు ఆకుల శ్రీనివాస కుమార్ ఈ పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా గ్రంథాలయం అధ్యక్షులు చింతలపూడి కోటేశ్వరరావు మాట్లాడుతూ విజ్ఞానాన్ని అందరికీ పంచాలన్న సదుద్దేశంతో ఆకుల శ్రీనివాస్ తన కుమారుడి జ్ఞాపకార్థం వైద్య విద్యకు సంబంధించిన విలువైన పుస్తకాలను గ్రంథాలయానికి అందించడం అభినందనీయమని అన్నారు. 115 సంవత్సరాల చరిత్ర కలిగిన రామ్మోహన్ గ్రంథాలయానికి ఎంతో ఘనమైన చరిత్ర ఉందని చెప్పారు. ఎంతోమంది స్వాతంత్ర్య సమరయోధులు, విద్యావేత్తలు, మేధావులు, సమాజంలో ఉన్నత స్థాయికి ఎదిగిన అనేకమంది ఈ గ్రంథాలయాన్ని ఉపయోగించుకున్నారని తెలిపారు.ప్రస్తుతం కూడా అనేకమంది విద్యార్థులు, యువత గ్రంథాలయాన్ని ఉపయోగించుకుంటున్నారని, ఇలాంటి సమయంలో వైద్య విద్యకు సంబంధించిన విలువైన పుస్తకాలను అందించడం ద్వారా విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. తన కుమారుడి జ్ఞాపకార్థం పుస్తకాలను అందించడం ద్వారా ఆయన జ్ఞాపకాలను సమాజానికి ఉపయోగపడేలా నిలబెట్టడం గొప్ప విషయమని పేర్కొన్నారు. ఆకుల శ్రీనివాస కుమార్ కుటుంబానికి భగవంతుని ఆశీస్సులు ఉండాలని,డాక్టర్ ఆకుల రాజ్ కుమార్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. అనంతరం ఆకుల శ్రీనివాస కుమార్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా నిరక్షరాస్యులు లేకుండా ప్రతి ఒక్కరూ చదువుకోవాలన్న లక్ష్యంతో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. విద్య అనేది వ్యక్తి జీవితాన్నే కాకుండా సమాజం మొత్తాన్ని అభివృద్ధి చేసే గొప్ప సాధనమని అన్నారు. పుస్తక భాండాగారంగా ఎంతో గొప్ప చరిత్ర కలిగిన రామ్మోహన్ గ్రంథాలయానికి రావడం, ఇక్కడ తన కుమారుడి జ్ఞాపకార్థం వైద్య విద్యకు సంబంధించిన పుస్తకాలను అందించడం తనకు ఎంతో సంతృప్తిగా ఉందన్నారు. రామ్మోహన్ గ్రంథాలయాన్ని అనేకమంది ప్రముఖులు, స్వాతంత్ర్య సమరయోధులు, విద్యావంతులు ఉపయోగించుకున్నారని, ఇలాంటి చారిత్రక గ్రంథాలయానికి తన కుమారుడి జ్ఞాపకార్థం పుస్తకాలను అందించడం తనకు ఎంతో సంతృప్తిని కలిగిస్తోందని ఆకుల శ్రీనివాస కుమార్ తెలిపారు.తన కుమారుడు డాక్టర్ ఆకుల రాజ్ కుమార్ జ్ఞాపకాలు ఎప్పటికీ నిలిచిపోవడంతో పాటు ఆయన సేవా స్ఫూర్తి మరింతమందికి చేరాలన్న ఉద్దేశంతోనే ఈ పుస్తకాలను అందించినట్లు చెప్పారు. ముఖ్యంగా వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఈ పుస్తకాలు ఎంతో ఉపయోగపడతాయని, ప్రతి ఒక్క విద్యార్థి వీటిని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మరింతమంది విద్యార్థులు వైద్య వృత్తిలోకి వచ్చి పేదలు, బలహీన వర్గాలు, అవసరంలో ఉన్న ప్రజలకు సేవ చేయాలని కోరారు. తన కుమారుడు స్వర్గీయ ఆకుల రాజ్ కుమార్ అందించిన సేవా స్ఫూర్తి కొనసాగుతూ భవిష్యత్‌లో మరెంతోమంది వైద్యుల రూపంలో సమాజానికి సేవ అందించాలని ఆకుల శ్రీనివాస కుమార్ ఆకాంక్షించారు. ఒకరి జ్ఞాపకార్థం అందించిన పుస్తకాలు రాబోయే రోజుల్లో ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్‌కు ఉపయోగపడనున్నాయి. జ్ఞానాన్ని పంచడం ద్వారా తన కుమారుడి జ్ఞాపకాలను చిరస్థాయిగా నిలిపేలా ఆకుల శ్రీనివాస కుమార్ చేపట్టిన ఈ కార్యక్రమం పలువురి ప్రశంసలు అందుకుంది.

## టీడీపీ లీడర్ షిప్ కాంక్లేవ్‌లో ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

**జిల్లా నేతలతో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే సునీత, శ్రీరామ్**





**అంకుశం న్యూస్ అనంతపురం సెప్టెంబర్ 8** మంగళగిరి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన 2వ రోజు టీడీపీ లీడర్ షిప్ కాంక్లేవ్ కార్యక్రమంలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్ పాల్గొన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జిల్లాలోని ఎమ్మెల్యేలు, అధ్యక్షులు ఇతర ముఖ్య నాయకులతో కలిసి ఎమ్మెల్యే సునీత, శ్రీరామ్ పాల్గొన్నారు. పార్టీని మరింత బలోపేతం చేయడం, ప్రజలకు మరింత చేరువగా పనిచేయడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు–అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లడం, క్షేత్రస్థాయిలో పార్టీని పటిష్టం చేయడం వంటి పలు ముఖ్యమైన అంశాలపై అధ్యక్షుడు చంద్రబాబు, నారా లోకేష్ దిశా నిర్దేశ్యం చేశారు. సుస్థిర అభివృద్ధి, ప్రజాసేవలు, సుపరిపాలన, పొలిటికల్ కమ్యునికేషన్?పై చర్చ – ఎల్ నినోపై అవగాహన, స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధతపై చర్చించారు. అధినేత చంద్రబాబు నాయకత్వ సామర్థ్యం పెంపుపై దిశానిర్దేశం చేశారు. అలాగే సమష్టి కార్యాచరణపై సూచనలు చేశారు.

## 54 మంది సివిల్ కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి ..

**జిల్లా ఎస్పీ పి.జగదీష్ కి కృతజ్ఞతలు తెలిపిన పదోన్నతి హెడ్ కానిస్టేబుళ్లు**





**అంకుశం క్రైమ్ న్యూస్ అనంతపురం సెప్టెంబర్ 8** అనంతపురం జిల్లాలో 54 మంది సివిల్ కానిస్టేబుల్స్ కు హెడ్ కానిస్టేబుల్ గా పదోన్నతి కల్పించిన అనంతపురం జిల్లా ఎస్పీ పి జగదీష్ ఈ సందర్భంగా కానిస్టేబుళ్లతమకు పదోన్నతి కల్పించి, వృత్తిపరంగా ముందడుగు వేసే అవకాశం కల్పించిన జిల్లా ఎస్పీ శ్రీ పి.జగదీష్, ని మరియు అదనపు ఎస్పీ ఎం.నాగభూషణంను పదోన్నతి పొందిన హెడ్ కానిస్టేబుళ్లు మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. పుష్పగుచ్ఛం అందజేసి తమ సంతోషాన్ని, ఆనందాన్ని వ్యక్తం చేశారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న 2007, 2009 బ్యాచ్‌లకు చెందిన 54 మంది సివిల్ కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పి. జగదీష్ మాట్లాడుతూ.. పోలీసు కానిస్టేబుళ్లుగా బందోబస్తు, స్టేషన్ నిర్వహణ, కోర్టు డ్యూటీలు, శాంతిభద్రతల పరిరక్షణలో క్రియాశీలకంగా వ్యవహరించారని కొనియాడారు. హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొందినందున ఇకపై కేసులు నమోదుతో పాటు దర్యాప్తు చేసే అధికారాలు వస్తాయని, ప్రతి ఒక్కరూ మరింత బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్ నాథ్ , సూరి, లక్ష్మినారాయణలు పాల్గొని పెద్ద ఎత్తున్న పదోన్నతులు కల్పించిన జిల్లా ఎస్పీ జగదీష్ మరియు అదనపు ఎస్పీ గారికి జిల్లా పోలీసు కార్యాలయం సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. వీరితో పాటు కృతజ్ఞతలు తెలియజేయడానికి ఏ.ఆర్ నుండీ సివిల్ కు కన్వర్షన్ అయిన కానిస్టేబుళ్లు కూడా విచ్చేసి కార్యక్రమంలో పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయమే లక్ష్యం

**ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయం**





**అంకుశం న్యూస్ విజయవాడ సెప్టెంబర్ 8** విజయవాడ డివి మేనర్ హోటల్ వేదికగా టీడీపీ జిల్లా పార్టీ ఎన్నికల సమావేశం జరిగింది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా సమావేశంలో సమగ్రంగా చర్చించారు. పార్లమెంటరీ పార్టీ ఎలక్షన్ ఇంచార్జ్ మక్కెన మల్లికార్జునరావు, జిల్లా పార్టీ అధ్యక్షులు గద్దె అనురాధ, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య, ఎమ్మెల్సీ వర్ల రామయ్య, మాజీ ఎమ్మెల్సీ పరుచూరి అశోక్ బాబు, టీడీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్చార్జ్ బుద్దా వెంకన్నతో కలిసి విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సమావేశంలో పాల్గొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామస్థాయి నుంచి కార్పొరేషన్ స్థాయి వరకు పార్టీ అనుసరించాల్సిన విధివిధానాలు, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అంశాలు, కూటమి అభ్యర్థుల విజయానికి అవసరమైన కార్యాచరణపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు. క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ, ఎన్నికల ప్రక్రియను పటిష్టంగా ముందుకు తీసుకెళ్లేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని నిర్ణయించారు.

**అభ్యర్థి ఎవరైనా.. కూటమి గెలుపే లక్ష్యం**

కూటమి తరఫున పోటీ చేసే అభ్యర్థి ఎవరైనా, వారి విజయానికి పార్టీ శ్రేణులందరూ సమష్టిగా కృషి చేయాలని సమావేశంలో స్పష్టం చేశారు. వ్యక్తిగత అభిప్రాయాలకు అతీతంగా కూటమి అభ్యర్థుల విజయమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా సమన్వయంతో ఎన్నికల కార్యాచరణను అమలు చేయాలని నిర్ణయించారు.

**ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి**

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ విధానాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సమావేశంలో నిర్ణయించారు. ప్రభుత్వ విధానాల ద్వారా ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను వివరించడంతో పాటు, స్థానిక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు.

## మాతృ మరణాలు తగ్గించండి


**ప్రోటోకాల్స్ తప్పనిసరిగా పాటించాలి : జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..**





**అంకుశం న్యూస్అనంతపురం, సెప్టెంబర్ 08 :** మాతృ మరణాలు తగ్గింపులో స్వస్తి, ఫాగ్సి, ఆదను లాంటి స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వానికి సహకరించడం వల్ల కాన్పు సందర్భంగా జరిగే మాతృ మరణాలు బాగా తగ్గిపోయాయని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. మంగళవారం అనంతపురం నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వైద్యులకు, స్టాఫ్ నర్స్ లకు క్షేమకర కాన్పులు చేయడంపై శిక్షణ శిబిరాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాల్లో, ఆసుపత్రిలో ఎన్ని వసతులు ఉన్నా మాతృ సంరక్షణకు అవసరమైన సాంకేతికత లేకపోతే పరిపూర్ణత రాదని చెప్పారు. మాతృ మరణాలు ఎక్కువగా కాన్పు సందర్భంలో జరుగుతున్నాయని, వాటిని నివారించేందుకు ప్రోటోకాల్స్ తప్పనిసరిగా పాటించాలని సూచించారు. గ్రామస్థాయిలో కూడా ఆరోగ్య సిబ్బందికి మాతృ ఆరోగ్య సంరక్షణకు అవసరమైన శిక్షణ, సాంకేతిక సహాయం అందించాలని పేర్కొన్నారు. ప్రైవేట్ రంగం కంటే ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలు మానవతా దృక్పథంతో, సేవాభావంతో అందిస్తున్నట్లు చెప్పారు. స్వస్తి తమ శిక్షణ సేవలు ప్రైవేట్ రంగానికి, ఆర్డిటి లాంటి స్వచ్ఛంద సంస్థలకు కూడా అందించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి డా.కట్టా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శిక్షణ పొందిన వైద్యులు తమ ఆరోగ్య కేంద్రంలోని వైద్యులు, పారామెడికల్ సిబ్బందికి శిక్షణ అందించాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో స్వస్తి సాంకేతిక నిపుణులు డా.నాగేంద్ర, ట్రైనింగ్ టీం లీడర్ డా.స్టెఫీ, జిల్లా సమన్వయకర్త విజయ్ కుమార్, ఫ్యాగ్సి సంస్థ శిక్షకులు డాక్టర్ సుచిత్ర, డాక్టర్ హర్షిత, జిల్లా మాస్ మీడియా అధికారి నాగరాజు, డిప్యూటీ డెమో లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# ధర్మవరంలో నూతన పింఛన్ దరఖాస్తుల ప్రక్రియను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్

**సచివాలయంలో దరఖాస్తుల పరిశీలన, ఇ-కేవైసీ నమోదు తీరు సమీక్ష**





**అంకుశం న్యూస్ ధర్మవరం,సెప్టెంబర్,08:** ధర్మవరం పట్టణ పరిధిలోని 15వ వార్డు, గాంధీనగర్ సచివాలయాన్ని శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలో నూతన పింఛన్ దరఖాస్తుల స్వీకరణ, క్షేత్రస్థాయి వేరిఫికేషన్, దరఖాస్తుల ప్రస్తుత స్థితి మరియు ఇ-కేవైసీ ప్రక్రియలను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు.

జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ...

ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతీ దరఖాస్తును నిశితంగా పరిశీలించాలని, అర్హత కలిగిన ఏ ఒక్క లబ్ధిదారుడూ విడిపోకుండా పక్కాగా క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేయాలని స్పష్టం చేశారు.దరఖాస్తుల వేరిఫికేషన్ మరియు వఖ్జ నమోదులో ఎలాంటి జాప్యానికి తావులేకుండా నిర్దేశిత సమయానికే అన్ని ప్రక్రియలు పూర్తి చేయాలని ఆదేశించారు.సచివాలయ సిబ్బంది కార్యాలయానికి వచ్చే అర్జీదారులకు అందుబాటులో ఉంటూ, ప్రక్రియపై సరైన అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం ఆర్డీఓ రాంభూపాల్ రెడ్డి,ధర్మవరం మున్సిపల్ కమిషనర్ వెంకట రమణయ్య,స్థానిక సచివాలయ అధికారులు, రెవెన్యూ సిబ్బంది మరియు డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.